క్లుప్తంగా

సన్మానం



వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.రామకృష్ణారావును ఎమ్మెల్యే నాగరాజు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సచివాలయంలో శుక్రవారం శాలువాతో సన్మానించారు. తొలుత అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని సీఎస్‌కు వివరించారు.

జిమ్నాస్టిక్స్ అకాడమికి విద్యార్థి ఎంపిక



నర్సంపేట : రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అకాడమికి పట్టణంలోని విజ్‌డమ్ స్కూల్‌లో మూడో తరగతి వరకు చదువుకున్న ఖానాపురం మండంలోని ధర్మరావుపేటకు చెందిన విద్యార్థి అలువాల గగన్‌తేజ్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కోచ్ ఆరెల్లి శ్రీనివాస్ మీడియాకు శుక్రవారం వివరాలు వెల్లడించారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జూన్ 10న జరిగిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో గగన్‌తేజ్ పాల్గొని ప్రతిభ కనబర్చి ఎంపికయ్యాడని తెలిపారు. గగన్‌తేజ నాల్గో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అకాడమీలో ఉచితంగా విద్యాభ్యాసం పొందుతాడని వివరించారు.

కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై నడపొద్దు



వర్ధన్నపేట : కేజ్ వీల్స్ కలిగిన ట్రాక్టర్లను రోడ్లపై నడపొద్దని సీఐ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో యజమానులను కోరారు. ట్రాక్టర్‌లను కేజ్ వీల్స్‌తో బీటీ, సీసీ రోడ్లపైకి తీసుకొస్తుండడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని తెలిపారు. ప్రభుత్వం భారీగా ప్రజాధనాన్ని వెచ్చించి వేసిన రోడ్లు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. కొందరు పొలాల్లో పని చేయడానికి కేజ్ వీల్స్‌తో రోడ్లును రోడ్ల మీదకు తీసుకొస్తూ రోడ్ల ధ్వంసానికి కారకులౌతున్నారని తెలిపారు. ఇక నుంచి కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్ల మీదకు తీసుకొచ్చే వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తొలిసారి రూ.5 వేలు, రెండోసారి రూ.15 వేల జరిమానా వేస్తామని, మూడోసారి సైతం రోడ్లపైకి కేజ్ వీల్స్ కలిగిన ట్రాక్టర్లతో చిక్కితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నేడు సమావేశం

పర్వతగిరి : నేడు వరంగల్ నగరంలోని ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్స్‌లో బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ, అనుబంధ సంఘాల శ్రేణులు హాజరు కావాలని కోరారు.

ఆర్థికసాయం



వర్ధన్నపేట : అలంకానిపేటకు చెందిన కోరుకొండ శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1991లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు శుక్రవారం రూ.20 వేల సాయం అందజేశారు. తొలుత శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

తిమ్మరాయినిపహాడ్‌లో..



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌కు చెందిన పసునూరి జంపయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు కొండవీటి ప్రదీప్‌కుమార్ శుక్రవారం రూ.5 వేల సాయం అందజేశారు. తొలుత జంపయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డిమాస కిశోర్, నాయకులు సట్టు గిరిబాబు, రమేశ్, మహ్మద్ అఫ్సర్, మంద చిన్ను, సలీం పాషా, చింతల రాములు, కొమ్మల కొమురయ్య, సింగారపు రమేశ్, వడ్లకొండ రవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కోతుల బెడద

● తలుపులు మూసి విద్యాబోధన



పాఠశాల ఆవరణలో తిరుగుతున్న కోతులు

నర్సంపేట రూరల్ : మండలంలోని ముత్తోజిపేటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కోతుల బెడదతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. క్రీడా మైదానంలో ఆడుకోవడానికీ, మధ్యాహ్న భోజన వేళ విద్యార్థులు బెంబలేత్తుతున్నారు. చేతిలో కర్రతో విద్యార్థులు స్కూల్ ఆవరణలో తిరిగే దుస్థితి నెలకొంది. తలుపులు మూసి విద్యాబోధన అందిస్తున్న పరిస్థితి నెలకొంది.

పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సుమారు 50–60 మంది ప్రతిరోజూ స్కూల్‌కు హాజరవుతున్నారు. అలాగే ఏడుగురు ఉపాధ్యాయులు, ఒక అటెండర్, ఇద్దరు మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారు. పాఠశాల ఆవరణలోని వాటర్ ట్యాంక్, పెద్ద మర్రి చెట్టుతోపాటు ఇతర వృక్షాలు కోతులకు ఆవాసంగా మారాయి. నిత్యం ట్యాంక్ పైన, చెట్ల మీద కోతులు ఉంటున్నాయి. పాఠశాలకు వచ్చే రోడ్లపైనా పలు సందర్భాల్లో కోతులు గుంపులుగా సంచరిస్తూ విద్యార్థులను బెంబేలెత్తిస్తున్నాయి. ఉదయం పాఠశాలకు వచ్చే సందర్భంలో విద్యార్థులను కోతులు అడ్డగిస్తున్నాయి. స్కూల్ గేటు వద్ద ఉపాధ్యాయుడు కాపు కాస్తూ విద్యార్థులను తరగతులకు పంపించాల్సి వస్తోంది. స్కూల్ భవనంలోని మొదటి అంతస్తులోని తరగతి గదుల్లోకి వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. ఒక్కోసారి కోతులు మెట్ల మీద ఉంటూ వెంట పడుతున్నాయి. ఇక విద్యాబోధన సందర్భంగా ఉపాధ్యాయులు తరగతి గదుల తలుపులు మూసి ఉంచక తప్పడం లేదు. తలుపులు తెరిచిన సందర్భాల్లో కోతులు గదుల్లోకి వచ్చిన పరిస్థితి ఉండేది. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి కోతుల సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వెతలు

పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే కార్మికుల పరిస్థితి దుర్భరంగా తయారైంది. కూరగాయలను కోతులు ఎత్తుకెళ్తుండడంతో కార్మికులు నిత్యం కోతుల మీద దృష్టి కేంద్రీకరించి పని చేస్తున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా కోతులు కూరగాయలు తీసుకెళ్తున్నాయి. కార్మికులపై కోతులు గుంపులుగా దాడి చేసిన సందర్భాల్లో కూరగాయలు వదిలేసి పరుగు తీయక తప్పడం లేదు.

మున్సిపల్ అధికారుల సాయం తీసుకుంటాం



స్కూల్‌లో కోతుల బెడద వాస్తవమే. విద్యార్థులు స్కూల్‌లోకి వచ్చే సమయంలో ఉపాధ్యాయుడు గేట్ వద్ద కాపలా ఉండక తప్పడం లేదు. కోతుల బారి నుంచి విద్యార్థులను కాపాడేలా ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. కోతుల సమస్య పరిష్కారం కోసం మున్సిపల్ అధికారుల సాయం తీసుకుంటా. పరిస్థితిని మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వివరిస్తా. సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తా.

\- కొర్ర సారయ్య, ఎంఈఓ

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం



రైతులకు సూచనలు చేస్తున్న డీఈ భిక్షపతి

● డీఈ భిక్షపతి

వర్ధన్నపేట : విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సుమారు ఆర్నెళ్లుగా పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ డీఈ భిక్షపతి తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ క్షేత్రాల్లోని ట్రాన్స్‌ఫారాలను శుక్రవారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. విద్యుత్ స్తంభాలు వంగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల మీద లోడు పెరగడం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టొద్దని స్పష్టం చేశారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది మాత్రమే స్టార్టర్లను, వైర్లను, ట్రాన్స్‌ఫార్మర్లను, ఫ్యూజ్‌లను మరమ్మతు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్, ఎస్ఎల్ఐ చంద్రమోహన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

● ఎంపీడీఓ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటస్వామి

పర్వతగిరి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి కోరారు. మండలంలోని నారాయణపురంలో 'ధర్తి అబ జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' కార్యక్రమంపై శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు చేపడుతోందని తెలిపారు. మండలంలోని నిరుపేద గిరిజన కుటుంబాలు సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాలని సూచించారు.

సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్ట్



దుగ్గొండి: పోలీసుల అదుపులో ఉన్న నాయకులు



పర్వతగిరి : నినాదాలు చేస్తున్న జీపీ ఉద్యోగులు

దుగ్గొండి : హైదరాబాద్‌లోని పంచాయతీ రాజ్ శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా తలపెట్టిన క్రమంలో మండలానికి చెందిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టపాక రాజేందర్, మండల అధ్యక్షుడు ముస్కు రాజు, తదితరులను పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాజేందర్, రాజు ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపి మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టులు సరికాదన్నారు. సాయంత్రం నాయకులను వ్యక్తిగత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు. అరెస్టైన వారిలో సీఐటీయూ నాయకులు రాజాలు, అశోక్‌రెడ్డి, రమేశ్, బుగ్గ బచ్చయ్య, తదితరులున్నారు.

పర్వతగిరి : చలో హైదరాబాద్ కార్యక్రమ నేపథ్యంలో మండలానికి చెందిన పలువురు గ్రామ పంచాయతీ ఉద్యోగులు కరుణాకర్, ప్రభాకర్, రజనిబాబు, మహేందర్, రాజులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టైన ఉద్యోగులు పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించకుండా అరెస్టులకు పాల్పడడం సరికాదన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

30న యాదవుల ఆత్మగౌరవ సభ

● గొల్ల, కురుమ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాజు, తదితరులు

దుగ్గొండి : ఈనెల 30న హైదరాబాద్‌లో యాదవుల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు గొల్ల, కురుమ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు కోరారు. ఆత్మగౌరవ సభ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో ఆయన శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. యాదవుల జనాభా ప్రకారం ప్రభుత్వం నామినేటెడ్, మంత్రి పదవులు ఇవ్వాలని ఆకాంక్షించారు. రెండో విడత గొర్రెల పంపిణీ నిలిచిపోవడంతో గొర్రెల కాపరులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టడంతోపాటు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల బాధ్యుడు నాగనబోయిన తిరుపతి, నాయకులు మచ్చిక రాజు, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లిలో తోట రాధమ్మ, కొండూరులో రామారపు సామేలు, రామారపు రాములు, తిర్మలాయపల్లిలో వంగాల మణెమ్మ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు దయాకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కొండూరుకు చెందిన ల్యాదెల్ల ప్రశాంత్‌ను కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు కర్ర రవీందర్‌రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, ఐత రాంచందర్, గజవెల్లి ప్రసాద్, మల్లయ్య, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



రాజేందర్



కృష్ణ

నల్లబెల్లి : పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఉడుత రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఖానాపురం, చెన్నారావుపేట మండలాల అధ్యక్షులు పెండెం భాస్కర్, సురేందర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, కృష్ణ మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అధ్యక్ష, కార్యదర్శులను సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్ తదితరులు అభినందించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎస్‌బీఐలో ఇబ్బందులు

వర్ధన్నపేట : పట్టణంలోని ఎస్‌బీఐలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని సేవలు నిలిచిపోవడంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన ఖాతాదారులు అసహనంతో వెనుతిరిగారు. సమస్యపై ఖాతాదారులు పలువురు ప్రశ్నించగా ఉద్యోగులు నిర్లక్ష్యంగా సమాధానం తెలిపారని విమర్శలు వెల్లువెత్తాయి. పలువురు ఖాతాదారులు బ్యాంకు ఉద్యోగుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

వనభోజనాలు



ఖానాపురం : మండలంలోని కొత్తూరు, ధర్మరావుపేట, తదితర గ్రామాలకు చెందిన ప్రజలు శుక్రవారం వనభోజనాలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వెలమ సంఘం నాయకులు, ప్రజలు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని కోరుకున్నారు. వనభోజనాలకు వెళ్లిన వారిలో వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు రవీందర్‌రావు, గోపాల్‌రావు, మోహన్‌రావు, రాంచందర్‌రావు, రాజేశ్వర్‌రావు, తదితరులున్నారు.

జూలై మొదటి వారంలో నార్లు పోయాలి

ఖానాపురం : మండలంలోని పాకాల ఆయకట్టు పరిధిలో పంటలు సాగు చేస్తున్న రైతులు జూలై మొదటి వారంలో నార్లు పోయాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బోగ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. పాకాల చెరువు నుంచి జూలై తొలి వారంలో సాగునీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఖరీఫ్‌లో ముందస్తుగా నాట్లు వేసుకుంటే రబీలోనూ ముందస్తుగా సాగుకు అవకాశం లభిస్తుందని తెలిపారు. అన్ని రకాల కాల వ్యవధులు కలిగిన వరి విత్తనాలు నార్లుగా జూలై 5వ తేదీలోపు పోసుకుంటే అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.

హాస్టల్‌ను ఆశ్రమ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట సర్వాపురంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆశ్రమ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్యకు వినతిపత్రం అందజేసింది. అనంతరం నరేశ్ మాట్లాడారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు సుమారు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి హాస్టల్‌ను ఆశ్రమ పాఠశాలగా ఉన్నతీకరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాములు, ప్రశాంత్ తదితరులున్నారు.

రైతులకు లబ్ధి చేకూర్చేలా పనులు

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు లబ్ధి చేకూర్చేలా అభివృద్ధి పనులు చేపడుతోందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. చెన్నారావుపేట–రంగాపురం గ్రామాల మధ్య పాకాల వాగుపై తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో పనులు చేయకుండా ఆర్భాటం చేశారని చెప్పారు. పనులను చేపట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పాకాల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.18 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఎన్నికల హామీలన్నిటినీ నెరవేర్చే దిశగా తాను పాటుపడుతున్నట్లు తెలిపారు. త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించి రెండు మండలాల ప్రజల, రైతుల స్వప్నాన్ని సాకారం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, నాయకులు మజ్జిగ రాంబాబు, కుమారస్వామి, రమేశ్, ఈర్య, రాజు, కుమారస్వామి, శోభన్, వెంకటేశ్వర్లు, రమేశ్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు

● పార్టీ సీనియర్ నాయకుడు రాములు



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రాములు

నర్సంపేట : కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు అందుతున్నాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని కోనాపురంలో లబ్ధిదారులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే పేదలకు ఇందిరమ్మ పేరుతో ఇళ్లు, నివేశనా స్థలాలు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పటిష్టమైన కార్యాచరణ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాంది పలికిందన్నారు. అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మండల నర్సింహరాములు, నాయకులు ఉప్పునూతుల లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా వినియోగంపై అవగాహన కీలకం



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్



గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్

● తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏఓ యాకయ్య

సంగెం : పంటల సాగులో యూరియా వినియోగంపై అవగాహన కీలకమని తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏఓ యాకయ్య స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సొసైటీ, ఆగ్రోస్, ఓడీసీఎంఎస్, ప్రైవేట్ డీలర్లకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. యూరియాను అధికంగా వినియోగిస్తే పెట్టుబడితోపాటు కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. భూసారం తగ్గి చీడపీడలు పంటలను ఆశించి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పంటల సాగులో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని కోరారు. గడువు తీరిన పురుగుల మందులు, విత్తనాలను ఎప్పటికప్పుడు సంబంధిత కంపెనీలకు తిరిగి పంపించాలని చెప్పారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగించి పెట్టుబడి తగ్గించుకుని పంటల దిగుబడి పెంచుకోవాలని చెప్పారు. అనంతరం గ్రోమోర్, తిరుమల సీడ్స్, కాపుల కనిపర్తిలోని సొసైటీ గోదాములను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, కోశాధికారి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వలస కార్మికుడి మృతి



రాంబాబు (ఫైల్)

నర్సంపేట రూరల్ : గుండెపోటుతో వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఓ లాడ్జీలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా గురజాలకు చెందిన చలవాది రాంబాబు (44) నర్సంపేటకు 20 రోజుల క్రితం వలస వచ్చాడు. స్థానిక బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో బిర్యానీ మాస్టర్‌గా పనిచేస్తూ లాడ్జీలోని ఓ గదిలో ఉంటున్నాడు. గురువారం రాత్రి హోటల్‌లో పని ముగించుకుని లాడ్జీకి చేరుకున్న రాంబాబు శుక్రవారం ఉదయం పనికి వెళ్లకపోవడంతో హోటల్ సిబ్బంది వచ్చి చూడగా అచేతనంగా పడి ఉన్నాడు. లాడ్జి నిర్వాహకుల సమాచారంతో పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారణ అయ్యిందని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించామని సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

రెండిళ్లలో చోరీ



విచారణ చేస్తున్న పోలీసులు, వేలిముద్రల నిపుణులు

సంగెం : మండలంలోని కాపుల కనిపర్తిలో తాళం వేసి ఉన్న రెండిళ్లలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఉడుతలపల్లి రవీందర్‌రావు ఈనెల 9న భార్య రత్నమ్మ కంటి ఆపరేషన్ కోసం హైదరాబాద్‌కు ఇంటికి తాళం వేసి వెళ్లారు. అలాగే వారి ఇంటి పక్కనున్న దుగ్యాల గోపాల్‌రావు దంపతులు గురువారం ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. ఈ క్రమంలో దొంగలు రవీందర్‌రావు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న బీరువాలోని ఒక టిన్నర నాలుగున్నర తులాల బంగారం, ఉంగరాలు చోరీ చేశారు. అలాగే గోపాల్‌రావు ఇంట్లోనూ తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 10 తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చిన గోపాల్‌రావు చోరీ విషయాన్ని గుర్తించి పోలీసులకు, రవీందర్‌రావుకు సమాచారం అందించారు. మామునూర్ ఏసీపీ వెంకటేశ్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, స్థానిక ఎస్సై నరేశ్ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. వేలిముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్ తనిఖీ చేసి ఆధారాలు సేకరించాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ఆలయంలో గంటలు..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లి గ్రామ శివారులోని ముదిరాజ్ కులస్తులకు చెందిన పెద్దమ్మతల్లి ఆలయంలో గంటలు అపహరణకు గురయ్యాయి. శుక్రవారం ఉదయం చోరీ వెలుగులోకి వచ్చింది. సుమారు రూ.18 వేల విలువైన మూడు గంటలు చోరీకి గురయ్యాయని ఆలయ కమిటీ బాధ్యులు పిట్టల తిరుపతి, కృష్ణం రాజు వెల్లడించారు.

పెట్రోల్ బంక్‌లో కల్తీ కంపు!

నర్సంపేట : పెట్రోల్ బంక్‌లో కల్తీ కంపు కొడుతోందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్రోల్ పోయించాక వాహనాలు మొరాయించడంతో వాహనదార్లు బంకు సిబ్బందితో వాగ్వాదానికి దిగిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మహబూబాబాద్ రోడ్డులోని హెచ్‌పీ బంకులో ద్విచక్ర వాహనదారులు పెట్రోల్ పోయించుకుని కొంత దూరం వెళ్లగా వాహనాలు మొరాయించాయి. ఇదే సమస్య ఎదుర్కొన్న పలువురు వెంటనే పెట్రోల్ బంక్‌కు చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. నీరు లేదా ఇతర ద్రవ పదార్థాలు కలిశాయని ఆరోపించారు. సిబ్బంది నచ్చజెప్పి పంపించినా సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.